సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 28 । జూలై । 2023



సైబర్ నేరాలు నియంత్రించాలి

సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పోలీసులు సైబర్ నేరాలను నియంత్రించాలని ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ అన్నారు. 8లో ▸



ప్రాజెక్టులకు జలకళ

మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో ప్రాజెక్టులకు వరద నీరు పోటెత్తుతోంది. దీంతో జలకళ ఉట్టిపడుతోంది. 8లో ▸

శ్రీవారి హుండీ ఆదాయం రూ.1.73 కోట్లు

ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించారు. రూ.1.73 కోట్ల ఆదాయం సమకూరింది.



8లో

న్యూస్‌రీల్

ఉగ్రంగా వశిష్ట గోదావరి



సిద్ధాంతం కేదారీఘాట్ వద్ద గోదావరి

పెనుగొండ: వశిష్ట గోదావరిలో వరద ఉధృతితో ఆచంట మండలంలో అనగారలంక, పల్లిపాలెం, అయోధ్యలంక, పుచ్చల్లంక, రాయిలంకల్లో ప్రజలు కలవరపడుతున్నారు. వరద నీరు పెరగడంతో సిద్ధాంతం కేదారీఘాట్ వద్ద అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసి మధ్యస్థ లంకలోకి రాకపోకలపై నియంత్రణ విధించారు. వందలాది పశువులు మధ్యస్థ లంకలో ఉండటంతో రైతులు అటుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో పోలీసులు జాగ్రత్తలు సూచించారు. వరద మరింత పెరిగితే సిద్ధాంతంలోని కేదారేశ్వరస్వామి ఆలయం, మధ్యస్థ లంక మునిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఎర్రకాలువకు వరద తాకిడి

భీమవరం (ప్రకాశం చౌక్): కొంగువారిగూడెం ఎర్రకాలువ ప్రాజెక్టులో నీటి విడుదల గణనీయంగా పెరిగితే ప్రాజెక్టు గేట్లు తెరిచి నీటిని కిందకు విడుదల చేస్తామని ఏలూరు జిల్లా జల వనరుల శాఖ ఎస్ఈ శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు దిగువ ప్రాంతాలైన జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, నల్లజర్ల, తాడేపల్లిగూడెం, నిడదవోలు మండలాల్లోని అధికారులు వరద హెచ్చరికను దృష్టిలో ఉంచుకొని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రాజెక్టు నీటిమట్టం సామర్థ్యం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 80.55 మీటర్లకు చేరిందని 3,183 క్యూసెక్కుల స్థిర మైన ఇన్‌ఫ్లో ఉందని తెలిపారు.

వేగంగా బియ్యం సేకరణ



మాట్లాడుతున్న జేసీ రామసుందర్‌రెడ్డి

సాక్షి, భీమవరం: జిల్లాలో బియ్యం సేకరణ వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 4.25 లక్షల టన్నుల బియ్యం సేకరణ లక్ష్యం కాగా ఇప్పటివరకు 2.20 లక్షల టన్నులు సేకరించారన్నారు. ఎఫ్‌సీఐ తక్కువ మోతాదులో డెలివరీలు ఇచ్చినందున పక్కా ప్రణాళికతో సకాలంలో బియ్యం డెలివరీలు ఇవ్వాలని ఎఫ్‌సీఐ డీఎంను ఆదేశించారు. వరదలు, వర్షాలతో ముంపునకు గురైన ప్రాంతాల్లో బియ్యం, నిత్యావసర సరుకులు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లయీస్ డీఎంకు సూచించారు. సివిల్ సప్లయ్ డిపో మేనేజర్ టి.శివరామ ప్రసాదు, ఎఫ్‌సీఐ డీఎం కులదీప్ సిన్హా, డీసీఓ ఎం.రవికుమార్, ఎంవీఐ ఎం.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శివరామకృష్ణ ప్రసాద్‌కు కలాం పురస్కారం



అవార్డు అందుకుంటున్న శివరామకృష్ణ ప్రసాద్


పాలకొల్లు అర్బన్: శివదేవునిచిక్కాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, గ్రామ వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘ త్రిసభ్య కమిటీ అధ్యక్షుడు ర్యాలి వెంకట శివరామకృష్ణ ప్రసాద్ (సిద్ధాంతి) ఏపీజే అబ్దుల్ కలాం లైఫ్ టైం ఎచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. గురువారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అవార్డు అందుకున్నారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, ప్రెస్ అకాడమి కార్యదర్శి ఎం.బాలగంగాధరతిలక్ మైనార్టీ వెల్ఫేర్ శాఖ కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్, శ్రీశ్రీ కళావేదిక ఇంటర్నేషనల్ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారన్నారు.

ఫార్మసీ కౌన్సిల్ మెంబర్‌గా వరప్రసాదరావు

ఏలూరు టౌన్: ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడిగా డాక్టర్ దిరిశాల వరప్రసాదరావు విశేష సేవలు అందించారు. తాజాగా ఆయన్ను ఏపీ ఫార్మసీ కౌన్సిల్ సభ్యుడిగా నామినేట్ చేస్తూ ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ బీఎస్ శివారెడ్డి ఫార్మసీ కౌన్సిల్‌కు లేఖ ద్వారా తెలియజేశారు. డాక్టర్ దిరిశాలకు ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని ప్రత్యేక అభినందనలు తెలిపారు. మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. తనను ఫార్మసీ కౌన్సిల్ సభ్యుడిగా నామినేట్ చేయడంపై దిరిశాల సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే నానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉప్పొంగుతున్న గోదావరి

- భారీగా వరద నీరు
- పోలవరం ప్రాజెక్టు నుంచి 11.81 లక్షల క్యూసెక్కులు దిగువకు..
- ముంపు బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- నిండు కుండల్లా రిజర్వాయర్లు
- అంతటా అధికారుల అప్రమత్తం
- దువ్వలో అక్విడెక్ట్‌ను పరిశీలించిన మంత్రి కారుమూరి



పోలవరం : పట్టిసం శివక్షేత్రం వద్ద వరద గోదావరి

సాక్షి ప్రతినిధి,ఏలూరు: గోదావరి వరద ఉధృతి కొనసాగుతుంది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలకు ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఈ సీజన్‌లోనే వరద గురువారం రికార్డు స్థాయిలో నమోదైంది. పోలవరం ప్రాజెక్టు నుంచి దిగువకు 11.81 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ముంపు మండలాలైన వేలేరుపాడు, కుక్కునూరుల్లో 34 గ్రామాలకు వరద ముంపు పొంచి ఉండటంతో రాకపోకలు స్తంభించాయి. ఆరు గ్రామాల ప్రజలను పునరావాస శిబిరాలకు, సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అలాగే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా వాగులు, ప్రధాన కాలవలు పొంగిపొర్లుతున్నాయి.

భారీగా ఇన్‌ఫ్లో

ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు పోలవరం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో భారీగా పెరిగింది. ఈనెల 20 నుంచి పోలవరానికి వరద కొనసాగుతుంది. 24వ తేదీ వరకు సరాసరి 7 లక్షల క్యూసెక్కుల నీటిని ధవళేశ్వరానికి విడుదల చేశారు. గురువారం రాత్రి 7 గంటల సమయానికి భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయడం 50 అడుగుల మేర నది ప్రవాహం ఉండటంతో పోలవరం ప్రాజెక్టు నుంచి 11,81,299 క్యూసెక్కుల నీరు 48 గేట్ల ద్వారా ధవళేశ్వరానికి విడుదల చేశారు. శుక్రవారం మధ్యాహ్నానికి వరద ప్రవాహం మరింత పెరుగుతుందని అంచనా.



యలమంచిలి: కనకాయలంకలో పడవలపై గ్రామస్తుల రాకపోకలు



వేలేరుపాడు: రేపాకగొమ్ము గ్రామస్తులను పడవలపై తరలిస్తున్న దృశ్యం



వేలేరుపాడు: అరటిపండ్లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు, సిబ్బంది

ముంపు మండలాల్లో వరద తీవ్రత

ముంపు మండలాల్లో వరద తీవ్రత ఎక్కువగా ఉంది. గురువారం వరద ఉధృతి పెరగడంతో వేలేరుపాడు మండలంలో ఆరు గ్రామాల ప్రజలను, కుక్కునూరు మండలంలో ఒక గ్రామం నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునవాస శిబిరాలకు తరలించారు. బూర్గుంపాడు-వేలేరుపాడు రహదారిపై వరద నీరు చేరడంతో భద్రాచలానికి రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు మండలంలోని రేపాకగొమ్ము, రుద్రమ్మకోట, తిరుమలాపురం, పాతనార్లవరం, వేలేరుపాడు సంతబజార్, తాటూకూరు గొమ్ము గ్రామాల ప్రజలను పునరావాస శిబిరాలకు తరలించారు. కొందరు కొండగట్లపై సురక్షిత ప్రాంతాలకు వెళ్లారు. అలాగే గొమ్ముగూడెంకు చెందిన 253 కుటుంబాలను దాచారంలోని ఆర్అండ్ఆర్ కాలనీ పునరావాస శిబిరానికి తరలించారు. పునరావాస శిబిరంలో రేపాకగొమ్ముకు చెందిన 611 మంది, గొమ్ముగూడెంకు చెందిన 740 మందికి భోజనం, తాగునీరు అందించారు. అలాగే రెండు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేశారు. జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి, అధికారుల బృందం పునరావాస శిబిరాన్ని పరిశీలించారు.

నిండుకుండల్లా రిజర్వాయర్లు

ఏలూరు జిల్లాలోని ఎర్రకాల్వ, తమ్మిలేరు, జల్లేరు రిజర్వాయర్లకు భారీగా వరదనీరు పోటెత్తడంతో ప్రాజెక్టులు పూర్తి సామర్థ్య స్థాయికి చేరుకున్నాయి. తమ్మిలేరు రిజర్వాయర్ 355 అడుగుల గరిష్ట సామర్థ్యానికి 345.49 అడుగుల మేర నీటి నిల్వ ఉంది. చింతలపూడి, లింగపాలెం, పెదవేగి, చాట్రాయి, ముసునూరు మండలాల ప్రజలు అప్రమత్తం ఉండాలని అధికారులు సూచించారు. జల్లేరు రిజర్వేయర్ కూడా పూర్తి సామర్థ్యం దశకు చేరుకుంది. జిల్లా అధికార యంత్రాంగం, పోలీస్ యంత్రాంగం పరిస్థితిని సమీక్షిస్తున్నారు. నీటమునిగిన పంటల వివరాల కోసం 13 మండలాల్లో 72 బృందాలను ఏర్పాటు చేశారు.

పశ్చిమలో..

పశ్చిమగోదావరి జిల్లాలో వర్షాలకు పంట పొలాలు ముంపు బారిన పడ్డాయి. పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దువ్వలో వయ్యేరు వద్ద వరద పరిస్థితిని పరిశీలించారు.

కనకాయలంకలో పెరిగిన గోదావరి



వరద పరిస్థితిపై అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

యలమంచిలి: మండలంలోని గోదావరిలో వరద నీరు పెరిగింది. శుక్రవారం ఉదయానికి కనకాయలంక గ్రామంలోని పల్లపు ప్రాంతాలకు వరద నీరు వచ్చే అవకాశం ఉందని తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు రక్షణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. కనకాయలంక ప్రజల రాకపోకల కోసం కాజ్‌వేపై మూడు పడవలను ఏర్పాటుచేశారు. కనకాయలంకలో ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ పర్యటించారు. పడవపై కనకాయలంక వెళ్లిన ఆయన ముంపు బాధితులను పరామర్శించారు. ఎవరూ భయపడాల్సిన పనిలేదని, వరద పెరిగితే పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. గ్రామంలో వైద్య శిబిరాన్ని సందర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. వరద పెరిగితే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్‌కు సూచించారు. ముఖ్యంగా నిత్యావసర సరుకులు, మంచినీటి కొరత లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, సర్పంచ్ మద్దా శ్రీనివాసరావు, వలవల ప్రసాద్, పులి సుబ్రహ్మణ్యం, నెల్లి ఆనందరావు ఉన్నారు.

విదేశీ విద్యకు ఊతం



భీమవరం కలెక్టరేట్‌లో జగనన్న విదేశీ విద్యాదీవెన చెక్కు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం: జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం పేద విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ఉందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జగనన్న విదేశీ విద్యా దీవెన పథకంలో 11 మంది లబ్ధిదారులకు రూ.85.88 లక్షల నమూన చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు రూ.1.25 కోట్లు, ఇతర విద్యార్థులకు రూ.కోటి వరకు నూరు శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ అవకాశం రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా కల్పించిందన్నారు. ప్రపంచంలోని ప్రముఖ వర్సిటీల్లో రాష్ట్ర విద్యార్థులు చదువుకునేలా ప్రభుత్వం ఊతమివ్వడం చారిత్రాత్మకమన్నారు. పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారి గణపతిరావు, సాంఘిక సంక్షేమ శాఖాధికారి కె.శోభారాణి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి డి.పుష్పరాణి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగిరపర్చాలి

భీమవరం (ప్రకాశం చౌక్): జిల్లాలో పేదల గృహ నిర్మాణాలు వేగిరపర్చాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో హౌసింగ్ అధికారులతో ఆమె సమీక్షించారు. జిల్లాలో మొత్తం 71,283 గృహ నిర్మాణాలు లక్ష్యం కాగా ఇప్పటివరకు 23,961 నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. 11,778 ఇళ్లు బేస్‌మెంట్, ఆపై దశల్లో ఉన్నాయన్నారు. నరసాపురం లేఅవుట్‌లో వెంటనే పనులను ప్రారంభించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లోని లేఅవుట్లలో రహదారుల రాకపోకలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. భీమవరం, నరసాపురం లేఅవుట్లకు ఆయా మున్సిపల్ కమిషనర్లను, తణుకు లేఅవుట్‌కు మున్సిపల్ డీఈ, పాలకొల్లు లేఅవుట్‌కు తహసీల్దార్‌ను ప్రత్యేకాధికారులుగా నియమించామన్నారు. హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ ఎస్టీవీ రాజేశ్వరరావు, డీఈ బి.పిచ్చయ్య, ఈఈలు బీవీ రమణ, వేణుగోపాల్, డీఈలు పాల్గొన్నారు.

రూ.16 కోట్లతో దువ్వ అక్విడెక్ట్ పునర్నిర్మాణం

మంత్రి కారుమూరి



దువ్వ అక్విడెక్ట్ వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు టౌన్: దువ్వలో శిథిలావస్థకు చేరిన వయ్యేరు అక్విడెక్ట్, వంతెన నిర్మాణానికి రూ.16 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపామని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. భారీ వర్షాలతో దువ్వలోని వయ్యేరుకు వరద నీరు పోటెత్తడంతో గురువారం ఆయన ఇక్కడ పర్యటించారు. వయ్యేరు గట్టు కింద నివాసం ఉంటున్న సుమారు 60 కుటుంబాలను పరామర్శించారు. అక్విడెక్ట్ శిథిలావస్థకు చేరిందని, గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మాత్రమే మరమ్మతులు చేశారని చెప్పారు. వచ్చే ఏడాదికి ఇక్కడ కొత్త అక్విడెక్ట్ నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామన్నారు. వయ్యేరు గట్టు కింద నివాసముంటున్న వారికి జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు కేటాయించామని, నిర్మాణాలు పూర్తికాగానే వారిని అక్కడకు తరలిస్తామన్నారు. వయ్యేరులో ఉదయం 9.1 అడుగులు ఉన్న నీటిమట్టం మధ్యాహ్నానికి 8.8 అడుగులకు తగ్గిందని, మరింత తగ్గే అవకాశం ఉందన్నారు. కారుమూరి సునీల్‌కుమార్, ఎంపీపీ రుద్ర ధనరాజు, సర్పంచ్ అడ్డా బాబు, మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, ముళ్లపూడి బాబూరావు, సొసైటీ అధ్యక్షుడు జేకే రాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు గోపాలకృష్ణ, ఇరిగేషన్, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

పునరావాస కేంద్రానికి 60 కుటుంబాలు

వయ్యేరు గట్టు కింద నివాసముంటున్న 60 కుటుంబాలను గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ హాలులో పునరావాస కేంద్రానికి తరలించినట్టు మంత్రి కారుమూరి తెలిపారు. వీరికి భోజన ఏర్పాట్లు చేసినట్టు తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ తెలిపారు.

రూ.286 కోట్లతో అమృత్-2 పనులు

భీమవరం (ప్రకాశంచౌక్): అమృత్ 2.0 పథకం కింద జిల్లాలో తాగునీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ నిర్వహణ పనులకు రూ.286.54 కోట్లు ఖర్చు చేయనున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆకివీడు, నరసాపురం, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెంలో పనులు చేపడతామని పేర్కొన్నారు. తణుకు, భీమవరం, తాడేపల్లిగూడెం జగనన్న కాలనీల్లో నీటి సరఫరాకు రూ.18.26 కోట్లు, ఆకివీడులో నీటి సరఫరా, అభివృద్ధి పనుల నిమిత్తం రూ.32.42 కోట్లు, నరసాపురంలో నీటి సరఫరా, అభివృద్ధి పనుల నిమిత్తం రూ.21 కోట్లు, భీమవరంలో నీటి సరఫరా అభివృద్ధి పనుల్లో భాగంగా ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణాలు, పైపులైన్లు, ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు, నిరంతర తాగునీటి సరఫరాకు రూ. 47.29 కోట్లు, తాడేపల్లిగూడెంలో నీటి సరఫరా, అభివృద్ధి పనుల నిమిత్తం రూ.41.79 కోట్లు ఖర్చు చేయనున్నట్టు పేర్కొన్నారు. భీమవరంలో ఎస్‌టీపీ నిర్మాణానికి రూ.13.39 కోట్లు, తాడేపల్లిగూడెం జగనన్న కాలనీలో ఎస్‌టీపీ నిర్మాణానికి రూ.12.19 కోట్లు, తాడేపల్లిగూడెంలో ఎస్‌టీపీ నిర్మాణ పనులకు రూ.100.20 కోట్లు ఖర్చు చేయనున్నట్టు వివరించారు. నిధుల వినియోగానికి పరిపాలనా ఆమోదం మంజూరు చేశారని, పనులు 2025-26 వరకు కొనసాగుతాయని వివరించారు.

'మత్తు'.. గుట్టురట్టు

- యథేచ్ఛగా మత్తు మందుల విక్రయాలు
- ఔషధ నియంత్రణ శాఖ అధికారుల సోదాలు
- గణపవరంలో బయటపడ్డ నిషేధిత ఔషధాలు
- జిల్లాలోని పలు దుకాణాల్లోనూ విక్రయిస్తున్నట్టు సమాచారం



గణపవరంలోని మెడికల్ షాపులో సోదాలు చేస్తున్న ఔషధ నియంత్రణ శాఖ అధికారులు

కఠిన చర్యలు

గణపవరంలో భాగ్యలక్ష్మి మెడికల్ షాపు ద్వారా అధిక మొత్తంలో మత్తు మందులు విక్రయాలు జరిగినట్లు గుర్తించాం. ఈ షాపు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఉమ్మడి జిల్లాలోని మెడికల్ షాపుల్లో ఎప్పటికప్పుడు సోదాలు నిర్వహిస్తూ వారి డేటాను పరిశీలిస్తూ మత్తు మందు విక్రయాలు అధికంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటాం.

– సీహెచ్ హరిప్రసాద్, ఉమ్మడి జిల్లా ఔషధ నియంత్రణ శాఖ ఏడీప

భీమవరం(ప్రకాశం చౌక్): ధనార్జనే లక్ష్యంగా ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతూ మత్తు మందుల విక్రయాలు జోరుగా సాగుతున్నట్టు ఔషధ నియంత్రణ శాఖ అధికారులు గుర్తించారు. జిల్లాలోని పలు మెడికల్ దుకాణాల్లో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందులను పెద్ద ఎత్తున విక్రయిస్తున్నట్టు వారి సోదాల్లో బయటపడింది. నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత మందుల అమ్మకాలపై ఔషధ నియంత్రణ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

చెక్ పెట్టేలా.. ఇటీవల భీమవరానికి వచ్చిన ఔషధ నియంత్రణ అధికారి అబిద్ అలీ మత్తు మందుల విక్రయాలను గుట్టురట్టు చేశారు. ఆయన పలు మందుల దుకాణాల్లో తనిఖీలు చేసి పెద్ద ఎత్తున మత్తు మందులు విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తించారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా అధిక పరిమాణంలో మత్తు మందులను ప్రజలకు విక్రయిస్తున్నట్టు వీరి సోదాల్లో బయటపడింది. భీమవరం ప్రాంతంలో మెడికల్ షాపుల డేటా సేకరించి మత్తు మందుల మాఫియాకు చెక్ పెట్టేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేసినట్టు తెలిసింది.

నిబంధనలు పట్టించుకోకుండా..

గణపవరంలోని భాగ్యలక్ష్మి మెడికల్ షాపు ద్వారా భారీగా మత్తు మందులు విక్రయాలు జరిగినట్లు అబిద్ ఆలీ గుర్తించి ఏలూరు ఔషధ నియంత్రణ శాఖ ఏడీఏకు తెలియజేశారు. ఏలూరు అధికారులు గణపవరంలోని ఈ దుకాణంలో సోదాలు చేసి రెండేళ్లలో వేల సంఖ్యలో మందులు విక్రయించినట్టు గుర్తించారు. ఇంత పెద్ద సంఖ్యలో మత్తు మందుల అవసరం ఈ ప్రాంతంలో ఉంటుందా అనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వ్యసనాలకు బానిసైన కొందరు యువకులు వీటిని వినియోగిస్తున్నట్టు అనుమానిస్తున్నారు. ఒకవేళ డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉన్నా కొద్దిరోజులకు మాత్రమే మత్తు మందులు వాడాలని సూచిస్తారు. అయితే వీటికి అలవాటు పడిన కొందరి బలహీనతను సొమ్ము చేసుకునేలా మెడికల్ షాపుల యజమానులు విక్రయాలు సాగిస్తున్నట్టు తెలుస్తోంది.

భీమవరంలో ఏజెన్సీల ద్వారా..

భీమవరంలో కొన్ని మెడికల్ ఏజెన్సీల ద్వారా జిల్లాలోని మెడికల్ షాపులకు మత్తు మందుల సరఫరా జరుగుతున్నట్టు అధికారులు భావిస్తున్నారు. జిల్లాలోని అన్ని మెడికల్ షాపుల్లో సోదాలు, వారికి సరఫరా అవుతున్న మందులకు సంబంధించి డేటా సేకరిస్తే మత్తు మందుల మాఫియాకు చెక్ పెట్టవచ్చనే దిశగా ముందుకు సాగుతున్నారు.

ఓటర్ల జాబితాపై అవగాహన తప్పనిసరి

కలెక్టర్ ప్రశాంతి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు పూర్తి అవగాహన ఉంటే అపోహలకు తావుండదని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా రూపొందించడంలో సందేహాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్థం కాని విషయాన్ని తప్పుగా భావించకూడదని, అర్థం చేసుకుని అవగాహన పెంచుకోవాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు వెంటనే బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకుని సమాచారాన్ని అందజేయాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు నియమించిన బీఎల్ఏలు, బీఎల్ఓలను అనుసరించడానికి అభ్యంతరం లేదన్నారు. ఓటర్ల జాబితా రూపొందించడంలో సందేహాలు ఉంటే వాస్తవ సమాచారంతో తమ దృష్టి తీసుకురావాలన్నారు. అపార్ట్‌మెంట్లలో ఎక్కువ కుటుంబాలు ఉంటాయని, అంతేగాని ఒకే డోర్ నంబర్‌తో ఎక్కువ ఓటర్లు నమోదైనట్టు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఇకపై తరచూ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. అందరూ హాజరుకావాలని కోరారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, రాజకీయ పార్టీల ప్రతినిధులు తోట భోగయ్య, కోమటి రవికుమార్, మరపట్ల శ్యాంబాబు, యు.చంద్రశేఖర్, జేఎస్‌వీ గోపాలన్, కె.ఎలియారాజు పాల్గొన్నారు.

కేవీకేలో ప్రయోగాత్మక కార్యక్రమాలు

ఉండి: ఎన్నార్పీ అగ్రహారంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో రైతుల కోసం ప్రయోగాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు తెలిపారు. గురువారం కేవీకేలో పీఎం కిసాన్ సమ్మేళన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రకృతి, సేంద్రియ వ్యవసాయం, డ్రోన్ సాంకేతికత, చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులు, తేనెటీగల పెంపకం తదితర కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. కేవీకేలో హైబ్రీడ్ బంతిపూలు, ఐఐహెచ్ఆర్ ఆర్కా సామ్రాట్, టమాట, ఆర్కాఖ్యాతీ, పచ్చిమిర్చి, పీకేఎం-1 మునగ, ఆర్కా, ప్రజ్వల్, లిల్లీ, బొప్పాయి రెడ్‌లేడీ 786 రకం మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు.

మెట్ట, ఏజెన్సీ ప్రాజెక్టులకు జలకళ

నాలుగు రోజులుగా విస్తారంగా వర్షాలు

చింతలపూడి : మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు పడుతున్నాయి. దీంతో ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మెట్ట ప్రాంతంలో 450 మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. వర్షాలకు చెరువుల్లోకి భారీగా నీరు చేరింది. మధ్య తరహా ప్రాజెక్టులైన ఎర్రకాల్వ, తమ్మిలేరు ప్రాజెక్టుల నీటి మట్టం క్రమేపీ పెరుగుతోంది. వరద మరింత పెరిగే అవకాశం ఉండటంతో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఎప్పటికప్పుడు వరద పరిస్థితులను సమీక్షిస్తున్నారు.

ఎర్రకాల్వ

జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం వద్ద కరాటం కృష్ణమూర్తి (ఎర్రకాల్వ) జలాశయాన్ని నిర్మించారు. జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, కామవరపుకోట, ద్వారకాతిరుమల, నల్లజర్ల, ఉంగుటూరు మండలాల్లో సుమారు 34,364 ఎకరాలకు ఈ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందిస్తున్నారు. ఎర్రకాల్వ జలాశయం ఎఫ్ఆర్ఎల్ వద్ద గరిష్ట నీటి మట్టం 83.50 మీటర్లు. ప్రస్తుతం 80.45 మీటర్లకు నీటి మట్టం చేరుకుంది. భారీ వర్షాలకు ఎర్రకాల్వ జలాశయానికి ఎగువ నుంచి గంటకు 6,651 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుందని అధికారులు తెలిపారు.

తమ్మిలేరు

చింతలపూడి మండలం ఎర్రంపల్లి గ్రామం వద్ద తమ్మిలేరు జలాశయాన్ని నిర్మించారు. దీనికి సమాంతరంగా ఎన్టీఆర్ కృష్ణా జిల్లా మంకొల్లు వద్ద గోనెల వాగు(స్టోరేజ్) ట్యాంక్‌ను నిర్మించారు. తమ్మిలేరు ప్రాజెక్టు ఎఫ్ఆర్ఎల్ వద్ద నీటిమట్టం 355 అడుగులు. ఖమ్మంజిల్లా బేతుపల్లి మినీ ప్రాజెక్టుకు అలుగు పడటంతో ఆంధ్రాకాల్వ ద్వార తమ్మిలేరుకు గంటకు 4,500 క్యూసెక్కుల నీరు వస్తోంది. దీంతో ప్రస్తుతం నీటిమట్టం 346.16 అడుగులకు చేరుకుంది. గోనెలవాగు గరిష్ట నీటిమట్టం 355 అడుగులు. ప్రస్తుత వర్షాలతో 344 అడుగులకు చేరింది. వర్షాలు కొనసాగుతుండటంతో తమ్మిలేరు వద్ద వరద ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. అల్పపీడన ప్రభావంతో మరో 48 గంటలు భారీ వర్షాలు కొనసాగుతాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎగువ నుంచి వరద ఉధృతి పెరిగితే దిగువకు నీరు విడుదల చేస్తామని ఏలూరు ఇరిగేషన్ ఈఈ తెలిపారు. తమ్మిలేరు దిగువ మండలాలైన చింతలపూడి, లింగపాలెం, పెదవేగి, చాట్రాయి, ముసునూరు మండలాల రెవెన్యూ, ఇరిగేషన్ సంబంధిత అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు.



ఖమ్మం జిల్లా బేతుపల్లి ప్రాజెక్టుకు అలుగు పడి తమ్మిలేరు ప్రాజెక్టుకు తరలివస్తున్న వరద

ఎగువ నుంచి వరద నీరు

ఈ ఏడాది వర్షాలకు తమ్మిలేరు పూర్తిగా నిండే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎగువ ఖమ్మం జిల్లాలో పడుతున్న వర్షాలకు వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు వద్దే మకాం వేసి ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని అంచనా వేస్తున్నాం. ప్రాజెక్టు నీటిమట్టం 348 అడుగులు దాటి గరిష్ట స్థాయికి చేరుకుంటే జిల్లా అధికారుల సూచనల మేరకు గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తాం.

–బి.శ్రీనివాస్, డీఈ, తమ్మిలేరు ప్రాజెక్టు

గుబ్బల మంగమ్మ గుడికి నిలిచిన దర్శనాలు

జల్లేరు జలాశయానికి పోటెత్తిన వరదనీరు

బుట్టాయగూడెం: భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో గుబ్బల మంగమ్మ గుడి దర్శనానికి భక్తులు వెళ్ళకుండా కామవరం సమీపంలోని గేటు వద్దే నిలిపేశారు. గురువారం కూడా భక్తులను దర్శనానికి అనుమతించలేదు. దీంతో గేట్ల వద్దే పలువురు భక్తులు మంగమ్మతల్లికి దండం పెట్టుకుని మొక్కులు చెల్లించి పరిసర ప్రాంతాల్లోనే వంటలు చేసుకుని తిన్నారు. వాగులు తగ్గే వరకూ దర్శనానికి అనుమతించమని పరిస్థితులను బట్టి ప్రకటన చేసి భక్తులను దర్శనానికి అనుమతిస్తామని ఆలయ కమిటీ తెలిపింది. ఇదిలా ఉండగా గుబ్బల మంగమ్మ గుడికి వెళ్ళే రహదారి వాగుల ప్రవాహానికి ఇసుక మేట్లు వేసి రాళ్లు, రప్పలతో నిండిపోయింది. ఈ రహదారిపై కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్ళలేని పరిస్థితి. వర్షాలు తగ్గిన తర్వాత ఇసుక మెట్లను, రాళ్లను జేసీబీతో తొలగిస్తామని ఆలయ కమిటీ తెలిపింది.

జల్లేరు జలాశయానికి వరద

దొరమామిడి సమీపంలో ఉన్న గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయానికి గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో భారీగా వరదనీరు వచ్చి చేరింది. ఈ జలాశయం పూర్తి సామర్థ్యం 217.80 కాగా ప్రస్తుతం 215.10 మీటర్ల వరకూ వరదనీరు చేరింది. ఏ క్షణంలోనైనా జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తామని ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసరావు తెలిపారు. నీటిని విడుదల చేసిన సమయంలో బుట్టాయగూడెం మండలంతోపాటు జంగారెడ్డిగూడెం మండల పరిధిలోని రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ శాఖ అధికారులు తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. వాగు పరిసర ప్రాంతంలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.



జల్లేరు జలాశయంలోకి వరదనీరు చేరిన దృశ్యం



గుబ్బల మంగమ్మతల్లి దర్శనానికి వెళ్ళకుండా కామవరం గేట్ల వద్దే భక్తులను నిలిపివేసిన దృశ్యం

క్లుప్తంగా

శ్రీవారి హుండీ ఆదాయం రూ.1.73 కోట్లు



హుండీలలో నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీల నగదును స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో గురువారం లెక్కించారు. స్వామివారికి విశేష ఆదాయం సమకూరింది. గత 21 రోజులకు నగదు రూపేణా స్వామివారికి రూ.1,73,05,777 ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. కానుకల రూపేణా భక్తులు సమర్పించిన 329 గ్రాముల బంగారం, 5.225 కేజీల వెండితో పాటు, అధికంగా విదేశీ కరెన్సీ లభించాయన్నారు. అదేవిధంగా లెక్కింపులోకి రాని రద్దయిన పాత రూ. 1,000, రూ. 500 నోట్ల ద్వారా రూ.7,500 లభించినట్టు చెప్పారు.

29న అండర్-11 చెస్ పోటీలు

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణంలో జిల్లా చెస్ అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో అండర్-11 జిల్లా స్థాయి బాల, బాలికల చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న ఉదయం 10 గంటలకు పోటీలు జరుగుతాయన్నారు.

యనమదుర్రు డ్రెయిన్‌లో లారీ బోల్తా



భీమవరంలో యనమదుర్రు డ్రెయిన్‌లో బోల్తా పడిన తవుడు లోడు లారీ

సాక్షి, భీమవరం : భీమవరం పట్టణం గొల్లవానితిప్ప రోడ్డు యనమదుర్రు డ్రెయిన్‌లో గురువారం లారీ బోల్తా పడింది. గుడివాడ నుంచి గొల్లవానితిప్పకు తవుడు లోడుతో వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది. లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

సైబర్ నేరాలు నియంత్రించాలి

డీఐజీ అశోక్ కుమార్

పెదవేగి: సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పోలీసులు సైబర్ నేరాలను నియంత్రించాలని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్ కుమార్ అన్నారు. పెదవేగి పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో పోలీసు సిబ్బంది సైబర్ నేరాల దర్యాప్తుపై శిక్షణ పొందుతున్న నేపథ్యంలో డీఐజీ, ఎస్పీ మేరీ ప్రశాంతిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలను మోసగిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో సైబర్ నేరాల నివారణ కోసం పోలీసు స్టేషన్లలోని సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నట్లు డీఐజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ సైబర్ నేరాలపై ట్రైనింగ్ పొందిన సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రజలకు ఉపయోగపడేలా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలపై శిక్షణ ఇచ్చిన పోలీసు అధికారులకు డీఐజీ, ఎస్పీలు రివార్డు అందజేశారు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ కే.ప్రభాకర్ రావు, డీటీసీ ఇన్స్‌పెక్టర్ రామారావు, ఏలూరు త్రీటౌన్ ఇన్స్‌పెక్టర్ కోమాకుల శివాజీ, పెదవేగి సీఐ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పెదవేగి డీటీసీలో నిర్వహిస్తున్న శిక్షణలో మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్

మరింత గడువు కోరిన యూబీఐ అధికారులు

నూజివీడు: ఆగిరిపల్లి మండలంలోని నర్సింగపాలెం, సగ్గూరు గ్రామాల్లో బిజినెస్ కరస్పాండెంట్లు(బీసీ) స్వాహా చేసిన సొమ్మును డ్వాక్రా మహిళలకు చెల్లించేందుకు వచ్చే నెల 15 వరకు గడువు కావాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావును యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా (యూబీఐ) రీజనల్ డిప్యూటీ హెడ్ బీ హరీష్ కోరారు. ఈ నెల 21న ఆగిరిపల్లిలోని యూబీఐ బ్రాంచ్‌లో జరిగిన చర్చల్లో ఈ నెల 31లోగా స్వాహా చేసిన రూ.1.08 కోట్లను చెల్లిస్తామని హరీష్ లిఖితపూర్వకంగా హామీ ఇచ్చారు. స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో గురువారం హరీష్, యూబీఐ సీనియర్ మేనేజర్ శేఖర్‌లు అధికారులు, డ్వాక్రా మహిళల సమక్షంలో ఎమ్మెల్యేను కలిశారు. మరికొద్ది రోజులు గడువు కావాలని, ఆగస్టు 15 కల్లా డ్వాక్రా మహిళలకు సొమ్మును చెల్లించేలా చూస్తానని ఎమ్మెల్యే ప్రతాప్‌ను కోరారు. దీనికి అంగీకరించిన ఎమ్మెల్యే.. 15 నాటికి చెల్లించకపోతే ఊరుకునేది లేదని, కుంటిసాకులు చెబుతూ జాప్యం చేయాలని చూస్తే ఆ తరువాత వందలాది మంది మహిళలతో ఆగిరిపల్లిలోని యూబీఐ బ్రాంచ్ వద్దే ఆందోళనకు దిగుతానని స్పష్టంచేశారు. కూలీ పనులకు వెళ్లి కష్టపడి సంపాదించిన సొమ్మును స్వాహా చేశారని, వారి డబ్బులు వారికి ఇవ్వడానికి జాప్యం ఎంతమాత్రం సమంజసం కాదన్నారు. ఇక నుంచి డ్వాక్రా మహిళలు బ్యాంకు వద్దకే వచ్చి రుణాలను చెల్లిస్తారని, పాసు పుస్తకాలపై చెల్లించిన వివరాలు ప్రింట్ చేసి ఇవ్వాలన్నారు. ఆగస్టు 15 వరకు గడువు కోరుతూ లిఖితపూర్వకంగా హామీ తీసుకున్నారు.



నూజివీడు ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావుతో చర్చిస్తున్న యూబీఐ అధికారులు

వీధి కుక్కల దాడిలో 14 గొర్రెలు మృతి

చాట్రాయి: వీధి కుక్కలు దాడి చేయడంతో 14 గొర్రెలు మృతి చెందాయి. మండలంలోని చనుబండ గ్రామానికి చెందిన కటకం చెన్నారావు గొర్రెల్ని వర్షాలు పడుతుండంతో మెయిన్ రోడ్డులో ఉన్న షెడ్డులో పెట్టారు. గురువారం రాత్రి వీధి కుక్కలు దాడి చేయడంతో 14 గొర్రెలు మృతి చెందాయి. సుమారు రూ 1.50 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.



చోరీ కేసు నమోదు

పోలవరం రూరల్: పోలవరం మండలం గూటాలలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగినట్లు పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. గూటాల గ్రామానికి చెందిన సింహాద్రి వెంకట జగ్గారావు కుటుంబంతో కలిసి ఇంటికి తాళం వేసి ఈ నెల 23న హైదరాబాద్ వెళ్లారు. గురువారం వచ్చి చూడగా, ఇంటి తలుపులు తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న కాసు బంగారపు ఉంగరం, రూ.15 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

పురుగుల మందు తాగి యువకుడి మృతి

చింతలపూడి : చింతలపూడి గణేష్ కాలనీకి చెందిన మేకల ఆనంద్ కుమార్(23) పురుగుల మందు తాగి గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ కలహాలు, మేనమామతో ఆస్తి తగాదాల కారణంగానే ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని ఎస్ఐకె ప్రసాద్ తెలిపారు. కనిపెడ రోడ్డులోని ఒక కాలనీ ఇంట్లో మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

పాముకాటుకు గురైన ముగ్గురికి చికిత్స

పోలవరం రూరల్ : పోలవరం ప్రభుత్వ వైద్యశాలలో పాము కాటుకు గురై ముగ్గురు వైద్య చికిత్స పొందుతున్నారు. గురువారం పొలాల్లో పనులకు వెళ్లిన ముగ్గురు పాము కాటుకు గురయ్యారు. వీరిని పోలవరం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, డాక్టర్ జ్యోతి చికిత్స అందించారు. వీరి పరిస్థితి మెరుగ్గా ఉందని తెలిపారు. పట్టిసీమ, వింజరం, పోలవరం ప్రాంతాల్లోని ముగ్గురు రైతులు పాముకాటుకు గురయ్యారు. ఇటీవల పొలాల్లో పనులకు వెళ్తున్న వారు పాముకాటుకు తరచూ గురవుతున్నారు.

బాలికపై అత్యాచారం

ఆకివీడు : 8వ తరగతి చదువుతున్న బాలికపై యువకుడు అత్యాచారానికి పాల్పడిన సంఘటనలో పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.సత్యసాయి గురువారం చెప్పారు. పట్టణంలోని ఉల్వర్డన్ పేటలో ఉంటున్న గెడ్డాపు రామకృష్ణ బాలికకు మాయమాటలు చెప్పి గత మూడు నెలలుగా అత్యాచారానికి పాల్పడ్డాడని, విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. రామకృష్ణపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

23 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరు టూటౌన్ పరిధి అల్లూరి సీతారామరాజు స్టేడియం ఎదురుగా ఉండే గోకుల కల్యాణమండపంలో భారీ పేకాట శిబిరంపై 26న రాత్రి పోలీసులు దాడి చేశారు. టూటౌన్ సీఐ పీ.చంద్రశేఖర్‌కు వచ్చిన సమాచారం మేరకు బుధవారం రాత్రి తన సిబ్బందితో పేకాట శిబిరంపై దాడి చేశారు. పేకాట శిబిరంలో 23 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.51,500 నగదు స్వాదీనం చేసుకున్నారు. జూదరులను ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి వ్యక్తిగత పూచీకత్తుపై పంపినట్లు సీఐ తెలిపారు. ఈ పేకాట శిబిరంలో టీడీపీ నేతలు ఉన్నట్లు సమాచారం. ఒక టీడీపీ నాయకుడు మృతిచెందిన కార్యక్రమానికి హాజరైన సందర్భంలో గోకుల కళ్యాణమండపంలో పేకాట ఆడినట్లు తెలుస్తోంది.

వరదపై ఎప్పటికప్పుడు అప్రమత్తం

విపత్తుల సంస్థ ఎండీ బీఆర్ అంబేడ్కర్

భీమవరం (ప్రకాశంచౌక్): ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాల ప్రభావంతో గోదావరి వరద ఉధృతి మరో రెండు రోజుల వరకు పెరుగుతుందని విపత్తుల సంస్థ ఎండీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. గురువారం రాత్రి 7 గంటలకు భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతుందని, ధవళేశ్వరం బ్యారేజి వద్ద ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో 13.05 లక్షల క్యూసెక్కులు ఉందని చెప్పారు. రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు వెల్లడించారు. రెండో ప్రమాద హెచ్చరిక వల్ల ప్రభావితమయ్యే అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, ఏలూరు, కాకినాడ, కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 42 మండలాల్లోని 458 గ్రామాలలో క్షేత్రస్థాయిలో నిరంతరం అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. విపత్తుల సంస్థ ఎప్పటికప్పుడు వరద ప్రవాహాన్ని పర్యవేక్షిస్తూ సంబంధిత జిల్లాల యంత్రాంగానికి సూచనలు జారీ చేస్తుందన్నారు. అత్యవసర సహాయక చర్యలకోసం 3 ఎన్డీఆర్ఎఫ్, 4 ఎస్డీఆర్ఎఫ్ మొత్తం 7 బృందాలు ఉన్నట్లు విపత్తుల సంస్థ ఎండీ తెలిపారు. ప్రజల ఫోన్లకు హెచ్చరికలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సందేశాలు పంపుతున్నామన్నారు. పూర్తిస్థాయిలో వరద తగ్గే వరకు గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మరోవైపు ప్రకాశం బ్యారేజీ వద్ద 1.42 లక్షల ఔట్ ఫ్లో ఉందని కృష్ణా లోతట్టు ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలు అత్యవసర సహాయం, సమాచారం కోసం 24 గంటలు అందుబాటులో ఉండే స్టేట్ కంట్రోల్ రూమ్ నెంబర్లు 1070, 1800 425 0101 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఏలూరులో విజిలెన్స్ తనిఖీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు నగరంలో సింధు, ఎస్ఆర్ఎంటీ కార్యాలయాల్లో విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్ ఆదేశాల మేరకు విజిలెన్స్, కమర్షియల్ ట్యాక్స్ అధికారులు దాడులు చేశారు. గురువారం ఏలూరు నగరంలోని సింధు ట్రావెల్స్, సింధు లాజిస్టిక్స్, ఎస్ఆర్ఎంటీ కార్యాలయాల్లో రికార్డులను తనిఖీ చేశారు. తనిఖీలో అనేక లోపాలను అధికారులు గుర్తించారు. లాజిస్టిక్స్‌లో సరుకుల రవాణాకు సంబంధించి బిల్లులు, వే బిల్లుల్లో తీవ్ర వ్యత్యాసాలు ఉన్నట్లు కమర్షియల్ ట్యాక్స్ అధికారులు గుర్తించారు. సుమారుగా రూ.8.74 లక్షల వ్యత్యాసాన్ని గుర్తించామని.. యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసి అపరాధ రుసుం వసూలు చేస్తామని అధికారులు తెలిపారు.



ఏలూరులో సింధు లాజిస్టిక్స్ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

యుద్ధప్రాతిపదికన పంట బోదెల నిర్వహణ

కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారుల చర్యలు

ఏలూరు(మెట్రో): భారీ వర్షాల కారణంగా నీట మునిగిన పంటను ఆదుకోవాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. పంట బోదెల నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల కొన్ని చోట్ల నీరు పొలాలలో ఉండిపోయిందన్న విషయం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ దృష్టికి వ్యవసాయ అధికారులు తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వ్యవసాయ, పంచాయతీ రాజ్, డ్వామా, ఇరిగేషన్ అధికారులతో కమిటీ వేసి పంటబోదెల నిర్వహణ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు టీంలుగా ఏర్పడి నీట మునిగిన పొలాలను పరిశీలించి పంట బోదెలను సరి చేయించారు. వర్షం కారణంగా ఏ ఒక్క రైతు నష్టపోకూడదని కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు అధికారులు రైతులతో మాట్లాడి భరోసా కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వై.రామకృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్, డ్వామా పీడీ పి.రాము తదితరులు పాల్గొన్నారు.

గుండుగొలనులో పంట బోదెల పరిశీలన

భీమడోలు మండలం గుండుగొలనులో పంట బోదెలను అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భరత్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా 450 ఎకరాల పంట మునిగిందని స్థానిక రైతులు అసిస్టెంట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. 12 గంటలలో పంటబొదెల నిర్వహణ చేపట్టి మురుగు నీటిని వెలుపలకు పంపించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ద్వారకాతిరుమల: మానసికంగా ఒత్తిడికి గురైన ఒక వ్యక్తి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తిరుమలపాలెంలో గురువారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆర్.రవి(45) తనకున్న ఒకే ఒక్క షాపును 6 నెలల క్రితం మూసివేశాడు. అప్పటి నుంచి ఇంట్లోనే ఉంటున్నాడు. అయితే మానసిక ఒత్తిడికి గురైన అతడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు రాత్రి ఖననం చేశారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు లేకపోవడంతో పోలీసు కేసు నమోదు కాలేదు.

అక్రమ మద్యం పట్టివేత

పాలకోడేరు: అస్సాం నుంచి లారీలో అక్రమంగా మద్యం తీసుకొస్తున్న నేదూరి పాండు, ఇళ్ల హరికృష్ణను వేండ్ర డెల్టా పేపర్ మిల్ వద్ద గురువారం అరెస్టు చేసినట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు. వీరి నుంచి 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, లారీని సీజ్ చేసినట్లు తెలిపారు.

ఫ్రైడ్ రైస్ బండి ధ్వంసం

సాక్షి, భీమవరం: పాత గొడవలు పురస్కరించుకుని ఈ నెల 17న ఐదుగురు కలిసి తన ఫ్రైడ్ రైస్ బండిని ధ్వంసం చేయడమే కాక తనను చంపుతానని బెదిరించారంటూ భీమవరం సుంకర పద్దయ్య వీధికి చెందిన గరగా సుబ్బలక్ష్మి వన్ టౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. పాత గొడవలు పురస్కరించుకొని గొంతెన ఝాన్సీ లక్ష్మి, గొంతెన ఉమామహేశ్వరరావు, గొంతెన హేమంత్ కుమార్ మరో ఇద్దరు కలిసి దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

క్లుప్తంగా

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పేదలకు సేవలు అందించడంలో లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు కొప్పిశెట్టి రమణయ్య అధ్యక్షతన గురువారం పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దాత కోనా హనుమాన్ సహకారంతో పేదలకు బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రమా కుమారి, సాయి శృతి, సుశీల ఫణికుమార్, ఎం.శివరామరాజు, మాధురి, నందిని తదితరులు పాల్గొన్నారు.

గూడెంలో 29.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 29.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ గురువారం తెలిపారు. పెంటపాడు మండలంలో 13.6 మిల్లీ మీటర్లుగా వర్షపాతం నమోదైందన్నారు.

రైతులకు అండగా కేంద్ర ప్రభుత్వం



కిసాన్ సమృద్ధి కేంద్రంలో నరేంద్రమోదీ ప్రసంగాన్ని వీక్షిస్తున్న బీజేపీనాయకులు, రైతులు

అత్తిలి: కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొవ్వూరి వెంకటరెడ్డి అన్నారు. దేశ వ్యాప్తంగా ప్రధాన మంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ టీవీల్లో మోదీ ప్రసంగాన్ని గురువారం అత్తిలి గ్రోమోర్ కేంద్రంలో వీక్షించారు.ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి రామరాజు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ తోట త్రిమూర్తులు, మల్లిడి కలికిరెడ్డి, పాలూరి శ్రీనివాసరావు, విలియమ్స్, అయ్యప్ప, సత్యనారాయణ, దాసం వెంకటేశ్వరరావు, రంభ రాములు, మురళి, దాసం దానయ్య, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణదారులకు జాబ్ కార్డులు అందించాలి

తణుకు టౌన్: జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణం చేపట్టిన ప్రతీ లబ్ధిదారునికి జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన జాబ్ కార్డును వెంటనే అందించాలని ఎంపీడీవో పీ శ్రీనివాసరావు కోరారు. గురువారం సాయంత్రం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ సిబ్బంది, జాతీయ ఉపాధి హామీ పథకం, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ. 2 కోట్లు విడుదలైనట్లు వాటిని వెంటనే పనులు చేపట్టాలని కోరారు. జాబ్ కార్డు ఇవ్వనివారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

నేడు మాస్ ప్లాంటేషన్ కార్యక్రమం...

ఈనెల 28వ తేదీన తణుకు మండలంలో 2800 మొక్కలను నాటే మాస్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పీ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఉదయం తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రారంభిస్తారని తెలిపారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



మెట్ట ఉప్పరగూడెంలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో వి.హనుమ

తాడేపల్లిగూడెం రూరల్: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని మండల విద్యాశాఖ అధికారి వి.హనుమ అన్నారు. గురువారం మండలంలోని మెట్ట ఉప్పరగూడెం గ్రామ సచివాలయం పరిధిలో డ్రాప్ అవుట్స్‌పై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా బడి మధ్యలో మానేసిన ఐదుగురు విద్యార్థులను గుర్తించి, వారిలో ముగ్గురిని ఎల్.అగ్రహారం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చేర్పించారు. వారికి జగనన్న విద్యాకానుక కిట్లను ఎంఈవో వి.హనుమ అందజేశారు. అలాగే పలువురు తల్లిదండ్రులతో మాట్లాడి తమ పిల్లల్ని ఓపెన్‌స్కూల్, వయస్సుకు తగ్గ తరగతిలో చేర్పించాలన్నారు. ఆయన వెంట సీఆర్‌పీ బత్తులనని బాబు, విద్యా కార్యదర్శి బెనర్జీ, వలంటీర్లు ఉన్నారు.

మీ సేవలు బంగారంగానూ..

- ఆర్బీకేలతో వ్యవసాయ విప్లవం
- టీడీపీ హయాంలో కన్నీళ్ల సాగు
- వైఎస్సార్ సీపీతో సంక్షేమ పరవళ్లు
- ఆర్బీకేల సేవలు అమోఘం



దర్శిపర్రులో నూతనంగా ప్రారంభించిన ఆర్బీకే కేంద్రం

పెంటపాడు: వైఎస్సార్ ప్రభుత్వం ద్వారానే రైతు సంక్షేమం పరవళ్లు తొక్కుతోంది. ఒకప్పుడు అన్నదాతకు సాగులో కష్టాలు, కన్నీళ్లే.. దినదిన గండాలే.. టీడీపీ అధినేత చంద్రబాబు సాగును దండగ అనడమే కాకుండా అలా మార్చారు కూడా. అలాంటి సమయంలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాగులో సిరులు కురిపించింది. వ్యవసాయ రంగాన్ని కొత్తపుంతలు తొక్కించింది. తద్వారా సాగు బంగారమైంది. ఆర్బీకేల ఏర్పాటుతోపాటు, వైఎస్సార్ యంత్రసాయం, సాగు రుణాలు, రైతు భరోసా వంటి పథకాలు కొండంత ఆసరాగా నిలిచాయి. నేడే రైతు ముంగిటకే వచ్చిన రైతు భరోసా కేంద్రాలతో అన్ని సేవలు సక్రమంగా అందుతున్నాయి. అన్నదాతలకు ప్రభుత్వం అడుగడుగునా అండగా నిలుస్తోంది. సీఎం జగనన్న నేనున్నాని పూర్తి భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి నాలుగేళ్లగా రైతు సంక్షేమానికి బాటలు వేస్తోంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా సాగుకు అవసరమైన అన్ని సదుపాయాలు రైతుల వద్దకే అందిస్తోంది. సాగులో ఎదురయ్యే ఇబ్బందులను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తోంది. ఇందులో భాగంగా మండలంలో మొత్తం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటి కోసం తగినంత సిబ్బందిని నియమించారు. వీరు నేరుగా రైతుల వద్దకే వెళ్లి సాగులో మెళుకువలపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన అన్ని సేవలు అందిస్తున్నారు. పెంటపాడు మండల పరిధిలో 24 వేలు ఎకరాల సాగుభూమి ఉంది. ఇందులో సుమారు 6 వేలమంది పంటలు సాగు చేస్తున్నారు.

ఆ ఇబ్బందులు తప్పాయి



గతంలో రైతులకు ఏదైనా ఇబ్బందులు ఎదురైతే మండల కేంద్రమైన వ్యవసాయ శాఖ వద్దకు వెళ్లాల్సి వచ్చేది. లేకపోతే అధికారులు గ్రామాలకు వచ్చేవరకు వేసి చూడాల్సిన పరిస్థితి ఉండేది. సీఎం వైఎస్ జగనన్న ప్రభుత్వంలో సంబంధిత సిబ్బంది గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంటున్నారు. అక్కడి నుంచి రైతులకు అవసరమైన అన్ని సేవలు అందిస్తున్నారు. దీంతో రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి ఇబ్బందులు తప్పాయి.

– భట్టు భరతాంజనేయులు రైతు, రావిపాడు

ఎంతో తోడ్పాటు



రైతులకు సాగులో ఎదురయ్యే పలు సమస్యలు పరిష్కరించేందుకు రైతు భరోసా కేంద్రాలు ఎంతో తోడ్పాటు అందిస్తున్నాయి. తమ గ్రామంలోనే ఏర్పాటైన ఆర్బీకే కేంద్రాల వద్దకు వెళ్లి అక్కడ సిబ్బందికి సమస్యలు చెప్పుకోవడం ద్వారా సమస్యల పరిష్కారం దొరుకుతోంది. గతంలో మండల కేంద్రంలో ఉండే అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ సమస్య లేదు.

– మర్రే కృష్ణమూర్తి, రైతుసంఘ నాయకులు కొండేపాడు

పంటలకు మద్దతు ధర



గతంలో దళారుల చెప్పిన ధరకు ధాన్యం అమ్ముకోవాల్సి వచ్చేది. అయితే మద్దతు ధరను ప్రకటించడంతో పాటు, ఆ ధరను ప్రభుత్వం కొనుగోలు చేస్తుండటంతో ఇప్పుడు రైతుకు మేలు జరుగుతోంది. కొనుగోలు విషయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే సంబంధిత అధికారులు సమస్యలను పరిష్కరిస్తున్నారు. ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేపట్టడంతో రైతులకు అదనపు ప్రయోజనం కలుగుతోంది.

– కె. పార్థసారధి మండల వ్యవసాయాధికారి, పెంటపాడు మండలం

స్వల్పంగా తగ్గిన ఎర్ర కాలువ వరద



వరద పరిస్థితిని సమీక్షిస్తున్న తహసీల్దార్ వై.దుర్గాకిషోర్, మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్

తాడేపల్లిగూడెం రూరల్: ఎర్ర కాలువ వరద స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. బుధవారంతో పోల్చుకుంటే గురువారం కొంత మేర వరద ఉధృతి తగ్గినట్లు కనిపిస్తోంది. ఎగువన వర్షాలు కురవకపోవడంతో ఎర్ర కాలువకు వరద నీరు తగ్గింది. గురువారం నందమూరు అక్విడెక్ట్ వద్ద 27.5 అడుగుల మేర వరద ప్రవహిస్తోంది. అక్విడెక్ట్ వద్ద వరద పరిస్థితిని తహసీల్దార్ వై.దుర్గాకిషోర్, మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్, మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్, ఉద్యాన శాఖ అధికారి శ్రీలక్ష్మి పరిశీలించారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. ఇదిలా ఉంటే, వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకుని మాధవరం – కంసాలిపాలెం వైపు రాకపోకలను నిలుపుదల చేశారు.

ఉప్పరగూడెంలో హెల్త్ సర్వే



తాడేపల్లిగూడెం మండలం ఉప్పరగూడెం గ్రామంలో హెల్త్ సర్వే నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్: వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలో ఆరోగ్య సిబ్బంది హెల్త్ సర్వే, క్యాంపు నిర్వహించారు. ఈ గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి అనారోగ్య పరిస్థితులు ఉన్నా గ్రామంలోని ఆశ కార్యకర్తకు తెలియజేయాలని మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎ.వీర వెంకటేష్ సూచించారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వివి.భాస్కర్, ఎంఎల్‌హెచ్‌పీ తారకం, ప్రశాంత్, తులసీ, ఆశా కార్యకర్త చంద్రకాంత, సిబ్బంది ఉన్నారు.

కలాం జీవితం యువతకు ఆదర్శం



అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గట్టిం మాణిక్యాలరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అబ్దుల్ కలాం జీవితం యువతకు ఆదర్శనీయమని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కార్యదర్శి నూకల నాగ మల్లేశ్వరరావు అధ్యక్షతన క్లబ్ కార్యాలయంలో గురువారం అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ పేరిచర్ల మురళీకృష్ణం రాజు, డీసీ ఎస్వీ రమణారావు, ఎం.శ్రీనివాసరావు, రంజిత్, జితేంద్ర పాల్గొన్నారు.

భారత రత్న ఏపీజే అబ్దుల్ కలాంకు ఘన నివాళులు

తణుకు టౌన్: భారత రత్న, మాజీ భారత రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా తణుకు మండలంలోని వివిధ పాఠశాలలో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కేవీ రంగయ్య మాట్లాడుతూ విద్యార్థులు డాక్టర్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



గూడెం డివిజన్ ఈఈ కార్యాలయం వద్ద విద్యుత్ ఉద్యోగులు నిరసన ప్రదర్శన చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు గురువారం స్థానిక జువ్వలపాలెం శివారు విద్యుత్ ఈఈ కార్యాలయం వద్ద భోజన విరామం సమయంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు, కార్మికులు నిరసన తెలిపారు. ఉద్యోగులు ఈ సందర్భంగా వారు ఎదుర్కొనే సమస్యలు, హక్కులు, రావాల్సిన బకాయిలు, పాలసీలు, కారుణ్య నియామకాలు, ఈపీఎఫ్, జీపీఎఫ్ వంటి అనేక సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. తాడేపల్లిగూడెం డివిజన్‌కు సంబంధించి 450 మంది విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యూలర్ చేయాలని, ఒకే మాస్టర్ స్కేల్ ఇవ్వాలని, పరిమితి లేని పూర్తి వైద్య సహకారం అందించాలని, పని ఒత్తిడి తగ్గించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ నిరసనను జేఏసీ నాయకులు, ఉద్యోగులు పర్యవేక్షించారు.

ఆరుగొలను గురుకుల భవనాలను పరిశీలించిన విశాల్



గురుకుల పాఠశాల నూతన భవనాలను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు కొట్టు విశాల్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను గురుకుల పాఠశాల నూతన భవనాలను గురువారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువ నాయకుడు కొట్టు విశాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చొరవతో రూ.22.5కోట్లతో అన్ని మౌలిక సదుపాయాలతో నూతన భవనాలను నిర్మించడం జరిగిందన్నారు. ఈ భవనాలను 30వ తేదిన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున ప్రారంభిస్తారని తెలిపారు. ఆయన వెంట ఎమ్పీటీసీ నార్ని శంకరరావు, ఉప సర్పంచ్ అడపా అప్పలరాజు, సొసైటీ చైర్మన్ చిక్కాల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, మద్దుకూరి మెహర్‌ప్రసాద్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో పాతూరు సెమి ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో మహాలక్ష్మినగర్ ఫీడర్, కొండయ్య చెరువు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఎల్ఐసీ ఫీడర్, కొండయ్య చెరువు ఫీడర్, కడకట్ల ఫీడర్‌లకు సంబంధించి ఈ నెల 28వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. మసీద్ రోడ్డు, పాతూరు, మహాలక్ష్మినగర్, చెట్లు రోడ్డు, సత్యవతి నగర్, కొండయ్య చెరువు, కడకట్ల, రెడ్డిగారి ఆసుపత్రి ఏరియా, బ్యాంక్ కాలనీ, ఉమెన్స్ కళాశాల, విద్యుత్ కాలనీ ఏరియాల్లో విద్యుత్ ఉండదని, పట్టణ వినియోగదారులు సహకరించాలని కోరారు.

జగనన్న సురక్ష.. జనానికి రక్ష



తణుకు అర్బన్: మహిళకు రేషన్ కార్డు అందజేస్తున్న కారుమూరి సునీల్‌కుమార్, కమిషనర్ సుధాకర్



తాడేపల్లిగూడెం రూరల్: కొండ్రుప్రోలులో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న తహసీల్దార్ వై.దుర్గాకిషోర్

తణుకు అర్బన్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పేద ప్రజలకు అవసరమైన సేవలు ఉచితంగా అందజేస్తున్నామని యువనేత కారుమూరి సునీల్‌కుమార్ అన్నారు. తణుకు 18, 19 వార్డులకు సంబంధించి 18వ వార్డు రామాలయం వీధిలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులెవరైనా మిగిలిపోయారా అనే ఉద్దేశ్యంతో సచివాలయ సెక్రటరీలు, వలంటీర్ల బృందాన్ని ఇంటింటికి వెళ్లి వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని జల్లెడ పట్టినట్లు చెప్పారు. దీంతోపాటు 11 రకాల సేవలకు సంబంధించిన జనన, మరణ, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు అందచేయడంతో పాటు రేషన్ కార్డుల్లో మార్పులను చేసి కొత్త కార్డులను ఉచితంగా అందించే కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు.

కమిషనర్‌కు సత్కారం...

తణుకు మునిసిపాలిటీ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం చివరిరోజు పూర్తికావడంతో కార్యక్రమాన్ని నెలరోజుల పాటు విజయవంతంగా నిర్వహించిన మునిసిపల్ కమిషనర్ కేటీ సుధాకర్, డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డిలను కారుమూరి సునీల్ కుమార్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, 18వ వార్డు ఇన్‌చార్జ్ సప్పా బలరామకృష్ణ, వార్డు నాయకులు పర్ల కొండబాబు, జామి శ్రీను, జాన్సన్, శివారెడ్డి, టీపీ నాగిరెడ్డి, తణుకు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం

తాడేపల్లిగూడెం రూరల్: అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారికి లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ ధ్యేయమని తహసీల్దార్ వై.దుర్గా కిషోర్ తెలిపారు. గురువారం మండలంలోని మాధవరం, కొండ్రుప్రోలు, ఎల్.అగ్రహారం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొండ్రుప్రోలులో తహసీల్దార్ దుర్గాకిషోర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందని, ఇంకా మిగిలి ఉన్న అర్హులకు న్యాయం చేయడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టిందన్నారు. దీని ద్వారా ఇంటింటికి తిరిగి సర్వే చేసి, మిగిలి ఉన్న అర్హులను గుర్తించాలన్నారు. ఇలా గుర్తించిన వారికి అవసరమైన ధ్రువపత్రాలను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. అనంతరం కొండ్రుప్రోలులో 1706, మాధవరంలో 5120, ఎల్.అగ్రహారంలో 1663 ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ముప్పిడి సూర్యకుమారి, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, జూనియర్ అసిస్టెంట్ ఎ.ప్రభుకుమార్, ఈవో ఆర్‌వీ.బ్రహ్మం, పంచాయతీ కార్యదర్శి వై.హరికిషోర్, ఎలక్ట్రికల్ ఏఈ అల్లు రామకృష్ణ, నవ్యశ్రీ, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, జద్దు హరిబాబు, డైరెక్టర్ నీలపాల రామన్న, ఏఎంసీ చైర్మన్ తమ్మిశెట్టి చుక్కయ్య, సొసైటీ మాజీ చైర్మన్ వీఎస్‌వీఎస్.నారాయణ, మండల సచివాలయల కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్, నాయకులు తారమట్ల శ్రీనివాస్, కవులూరి వెంకన్న, కంకట రాజారత్నం, నీలపాల చంద్రయ్య, కట్టా గంగారావు, బండి గణపతిరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

ఇరగవరం: జగనన్న సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కారుమూరి సునీల కుమార్ అన్నారు. గురువారం రేలంగి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కారుమూరి సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రజల సంతృప్తి చెందే విధంగా జగనన్న సురక్ష కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగ తాయారు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్ సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, గ్రామా పార్టీ అధ్యక్షుడు పులుపు అనిల్, పులుపు సునీల్, నాయకులు వద్దే మార్కేండేయులు, చేబ్రోలు పెద్దిరాజు, మైనం పాము, అధికారులు లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక మసీద్ సెంటర్‌లోని మండల పరిషత్ ఎలిమెంటరీ స్కూల్‌లో గురువారం క్లబ్ తరపున దాతలు పద్మశ్రీ స్వర్గీయ తాడేపల్లి వెంకన్న భార్య మేరీ విజయం, కుటుంబ సభ్యులు సహకారంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్లేట్లు, వాటర్ బాటిల్స్, స్టేషనరీ, స్వీట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ వంగపండు రామ్మోహన్‌రావు, సెక్రటరీ చిన్నం జగదీష్, కోశాధికారి జీడిగుంట హరిబాబు, సన్నిధి సూర్యనారాయణమూర్తి, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, పచ్చా వెంకటేశ్వరరావు, బాపయ్య శర్మ, త్రిమూర్తులు, రామ కృష్ణారావు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పారిశుద్ధ్యంలో ప్రజలు భాగస్వాములు కావాలి



తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలనులో స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామ పారిశుద్ధ్యంలో ప్రజలు భాగస్వాములు కావాలని గ్రామ సర్పంచ్ పీతల బుచ్చిబాబు అన్నారు. గురువారం మండలంలోని ఆరుగొలను గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్–2023 అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బుచ్చిబాబు మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటిలో చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారేయరాదని, తడి, పొడి చెత్తలను వేర్వేరుగా పారిశుధ్య సిబ్బందికి అందించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగిస్తే వెయ్యి రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు సాధించడానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్‌సీ టీమ్ ఎడ్వర్డ్, ఎమ్పీటీసీ నార్ని శంకరరావు, సొసైటీ ప్రెసిడెంట్ చిక్కాల సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస చంద్రరాజు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మీనవిల్లూరులో గడపగడపకు కార్యక్రమం

పెంటపాడు: మండలంలోని మీనవిల్లూరు గ్రామంలో గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం సాయంత్రం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, పార్టీ బీసీ సంఘ నాయకులు చింతపల్లి శ్రీనివాస్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ముఖ్యఅతిధిగా పాల్గొంటారన్నారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి అధికారులు, మండల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు విధిగా పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు.

మణిపూర్ ఘటనపై నిరసనలు



తణుకులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మెహర్ అన్సారీ తదితరులు



పట్టణంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

తణుకు అర్బన్: మణిపూర్ ఘటన యావత్ భారతీయులను ఉలిక్కి పడేలా చేసిందని రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ అన్నారు. తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలను నగ్నంగా బహిరంగంగా వీధుల్లో తిప్పిన ఘటన సభ్యసమాజం తలదించుకోవాల్సిన పరిస్థితి అన్నారు. మణిపూర్‌లో ఘటన జరిగి 3నెలల తరువాత బయటకు వచ్చేలా అక్కడి ప్రభుత్వం ప్రపంచానికి తెలియకుండా ఉండేలా సమస్యను తొక్కిపట్టి ఇంటర్నెట్‌ను సైతం నిలిపివేసిందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో తణుకు, అత్తిలి, ఇరగవరం మండల మహిళాధ్యక్షురాలు సీహెచ్ శ్యామల, కాకర్ల విశాలాక్షి, ఎం.కిరణ్మయి, నత్తా కృష్ణవేణి, శకుంతల, పి.నాగలక్ష్మి, షేక్ ఫాహిమా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దాన వరప్రసాద్ కోరారు. శేషమహల్ సెంటర్‌లో గురువారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం జరిగింది. దాన వరప్రసాద్ మాట్లాడుతూ మణిపూర్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకి నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. గిరిజన తెగలపై, మైనార్టీలపై దాడులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలనారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.ఉదయరాజు, బాలసుబ్రహ్మణ్యం, ఎర్ర శ్రీను, అశ్విన్, భాష, నాగు, కృష్ణమోహన్, రామారావు, తాతారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మణిపూర్ సమస్యలను పరిష్కరించేందుకు మోదీ కృషి చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): మణిపూర్ రాష్ట్రంలో సమస్యలను పరిష్కరించేందుకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షాలు కృషి చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముస్లిం దేశాలలో అక్కడ పిల్లలు, మహిళలపై తాలిబాన్లు దాడులకు పాల్పడినప్పుడు భారతీయులుగా వ్యతిరేకించామని, నేడు మన దేశంలోనే మహిళలను నగ్నంగా ఊరేగించడం సభ్య సమాజం తల దించుకునే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు దళితులు, గిరిజనులు, ఆదివాసీలపై దాడులు చేస్తున్నారని, బీజేపీని సాగనంపాలన్నారు. సునీల్, ప్రేమ్, రమేష్ పాల్గొన్నారు.